విడిచారు. అందంగా నవ్వి.. 'సలాం!' అంటూ అభివాదం చేసింది చందల. అనేకమంది తురక విటులను దగ్గరగా చూసిన అనుభవజ్ఞురాలు చందల. ఆమెతో పాటు వచ్చిన వల్లికతో చర్చించి ఆమె చేయాల్సిన కార్యకలాపం వివరించాడు కాపయ.

* * *

దాదాపు మూడేళ్లపాటు తెలంగాణ రాజ్యంలోని అనుకూలురను, తురకలంటే హడలిపోతున్న యోధులను పోరాటానికి సమాయత్తం చేశాడు కాపయ. పున్నగి మహిళా యుద్ధదళం కూడా పోరాటానికి సంసిద్ధమైంది. వల్లిక నాయకత్వంలో గణికల బృందం పౌర సమాజాన్ని పోరాటానికి సిద్ధం చేస్తున్నది. ఇక యుద్ధ శంఖారావానికి సన్నాహాలు ముమ్మరంచేశాడు కాపయ. అతనిపై నమ్మకం పెరిగి.. సమస్త తెలంగాణ యుద్ధ సంసిద్ధమయ్యింది.

మరోవైపు దక్షిణావర్తానికి మరోసారి వచ్చిన ఢిల్లీ సుల్తాన్ తుగ్లక్.. మిగిలిన కాకతీయ రాజ్యాన్ని మరో రెండుభాగాలుగా విభజించాడు. భద్రకోట (బీదరు) రాజధానిగా.. షిహాబ్ సుల్తాన్‌ను వజీర్‌గా నియమించి, పశ్చిమ తెలంగాణగా ప్రకటించాడు. మిగిలిన తూర్పు తెలంగాణకు సుల్తాన్‌పూర్ (ఓరుగల్లు) రాజధానిగా.. మాలిక్ మక్బూల్‌ను వజీర్‌గా ప్రకటించి ఢిల్లీ వెళ్లిపోయాడు. మతంమారిన కాకతీయ యోధుడు గన్నమనాయుడే.. ఈ మాలిక్ మక్బూల్. ప్రతాపరుద్రుని పాలనలో ఓరుగల్లు కటకపాలకుడైన గన్నమ.. బలవంతంగా మతం మారాడు. ఓరుగల్లులోని దేవళాలను పడగొట్టి.. తుగ్లక్‌కు అత్యంత నమ్మకస్తుడిగా పేరుపొందాడు. ఇప్పుడు ఓరుగల్లు పాలకుడిగా వచ్చాడు. గన్నమ గురించి కాపయకు, కాపయ శౌర్య వీరత్వం గురించి గన్నమకు క్షుణ్ణంగా తెలుసు.

తెలంగాణ మండలేశ్వరులు, నాయంకరులు.. తమ సేనలతో చావోరేవో తేల్చుకోడానికి కాపయ నాయకత్వంలో యుద్ధ సన్నద్ధతలో ఉన్నారు. అటు మిత్రసమాఖ్య సేనలూ సిద్ధమని తెలియజేశాయి.

రాజ్యమంతా.. పైకి ప్రశాంతంగా ఉంది. ఎక్కడా యుద్ధ వాతావరణం కనిపించడం లేదు. ఆ సమయంలోనే.. కాపయ యుద్ధ శిబిరానికి ఓ వార్త అందించింది పున్నగి. అభివల్లయను రాజప్రాసాదంలో బంధించారన్నది ఆ వార్త సారాంశం.

* * *

ఓరుగల్లు రాజప్రాసాదం. విభిన్న వస్తువులు రాజప్రాసాదానికి అందించే తురకవ్యాపారి రూపంలో తన అశ్వశకటంతో రాజప్రాసాదం లోపలికి ప్రవేశించి.. ప్రధానద్వారం వద్ద శకటాన్ని నిలిపాడు కాపయ. రాజప్రాసాదం లోపల ఎందరో కాపయ అనుయాయులు ఉన్నారు. కొందరు వేగులవాళ్లు అతనికి అండగా నీడల్లా కదలుతున్నారు.

ఒకప్పుడు అద్భుతమైన రసరాజ్యంలా కళకళలాడిన కాకతీయ చక్రవర్తుల నివాసమైన ఆ రాజప్రాసాదం.. ఇప్పుడు నుదుట కుంకుమ కోల్పోయిన భార్యలా కళావిహీనమై పరమ అసహ్యంగా కనిపిస్తున్నది. ఆ రాజభవనాన్ని మానసికవేదనతో చూస్తూ లోపలికి వెళ్లి.. రాజప్రాసాద కొట్టారువు రుహుల్లాఖాన్‌కు అభివాదం చేశాడు. ఆయన సహాయకులు శకటంలోని వస్తువులను దించుకోసాగారు. కాపయ మౌనంగా ప్రాసాదం లోపలికి వెళ్తున్నాడు. ముందు బురఖాలోనున్న ఓ పరిచారిక అతనికి దారి చూపుతున్నదని ఎవ్వరికీ అనుమానం రావడంలేదు. మెల్లగా ఆమె చూపినవైపు మునికాళ్లపై నడుస్తూ లోలోపలికి వెళ్లాడు. అదొక చిన్న నడవా.. ఎదురుగా ఓ రాచమందిరం. మెల్లిగా ఆ మందిరం తలుపు తోశాడు. ఎదురుగా సింహాసనం లాంటి పల్యంకంపై విలాసంగా కూర్చుని మందహాసంతో చూస్తున్న ఓ ముస్లిం రాచయువతి!!

''స్వాగతం కాపయ నాయకులకు!!''..

* * *

ఓరుగల్లు రాజప్రాసాదపు ప్రధాన మహాద్వారం..

దాని ముందు.. శరీరమంతా తోలువలిచి తీసేసిన నగ్నశవం పడి ఉంది. చుట్టూ మూగి చోద్యం చూస్తున్నారు పురజనులు. అది ఓరుగల్లు రాజప్రాసాద దండనాయకుడు ఉనాయద్ ఖాన్ శవం.

కాసేపటికి సాక్షాత్తూ ఓరుగల్లు పాలకుడు వజీర్ మాలిక్ మక్బూల్ ముఖ్యసేనానులతో, ప్రధానులతో తరలివచ్చాడు. ఉనాయద్ ఖాన్‌ను అత్యంత దారుణంగా బతికుండగానే చర్మం వలిచి చంపి రాజప్రాసాదం ముందు పడేయడం.. చిన్నవిషయం కాదు. రాజప్రాసాదంలో శత్రు గూఢచారులు ఉన్నారు. ఢిల్లీ పాలకుల హింసాప్రవృత్తి పట్ల ఏమాత్రం భయపడని కాకతీయవీరులు రాజప్రాసాదంలోనే తిష్టవేశారు.

మక్బూల్ లేచాడు.

''ఈ ఘోరం చేసినవాళ్లెవరో.. వాళ్లకు సహకరించిన వాళ్లెవరో.. రాజప్రాసాదంలోఉన్న కాఫిర్లు ఎవ్వరో.. అందర్నీ విచక్షణారహితంగా నరికివేయండి!''..

* * *

వజీర్ మాలిక్ మక్బూల్ ఈ ప్రకటనచేసే సమయానికి కొరవి అడవుల్లోని తమ రహస్యశిబిరంలో కాపయ బృందం పండుగ చేసుకుంటున్నారు.

ఆరోజు రాజప్రాసాదంలో కాపయ ప్రవేశించిన శయనమందిరం వజీర్ సుల్తాన్ మక్బూల్ ప్రియురాలు నూర్జహాన్‌ది. 'కాపయ నాయకులవారికి స్వాగతం!' అంటూ అభివాదం చేసింది.. నూర్జహాన్‌గా చలామణి అవుతున్న కాకతీయ వీరవనిత చందల. ఆశ్చర్యపోయిన కాపయ తలతిప్పిచూస్తే.. ఆవలగా మరో బల్లవద్ద తాపీగా విందు ఆరగిస్తున్నాడు అభివల్లయ.

''అరె! చందల ఢిల్లీనుంచి వచ్చి రాజభవనంలో విజయవంతంగా తిష్ట వేసిందని పున్నగి చెప్పలేదే!'' అన్నాడు ఆనందంగా కాపయ.

మక్బూల్‌గా మారిన గన్నమతో ఆమెకు ముందు నుండే బాంధవ్యం ఉంది. మక్బూల్ ఓరుగల్లుకు వజీర్ కావడంతో.. నూర్జహాన్‌గా మారిన చందలకు యుద్ధతంత్రాలన్నీ ముందే తెలిసిపోతున్నాయి. అభివల్లయను బంధించి తోలువలిచి చంపి.. కాపయబృందాలను బెదరకొట్టాలని మక్బూల్ పథకం వేశాడు. ఇది చందలకు ముందే తెలిసింది. అభివల్లయను బందిఖానా నుంచి తప్పించి తన మందిరంలోనే దాచింది. పున్నగికి వార్త అందించింది. గెరిల్లా యోధులంతా జరిగింది విని.. కాపయ, అభివల్లయలను అభినందించసాగారు.

అప్పుడే వచ్చిన వార్తాహరుడు వగరుస్తూ..

''నాయకా దుర్వార్త! ఆ దుర్మార్గులు చందలను గుర్తించారు. ఆమెను తొమ్మిది ఖండాలుగా నరికి రాజప్రసాద తొమ్మిదిద్వారాలకు వేలాడదీశారు. రాజప్రాసాదంలోని మనవాళ్లను వెతికివెతికి చంపుతున్నారు!''.

మరికాసేపటికి గుర్రాలు లేపిన దుమ్ము అక్కడంతా కమ్ముకుంది.

* * *

యుద్ధం మొదలయ్యింది. కాపయ సైన్యం, మిత్రసమాఖ్య సైన్యాలు ఏకమై ఓరుగల్లు విముక్తికి తీవ్రంగా పోరాడుతున్నాయి. బయట సైనికయుద్ధమే కాదు.. రాజప్రాసాదంలో, ఓరుగల్లు నగరంలో, గ్రామాల్లో.. తెలంగాణ రాజ్యమంతటా ప్రజలు చేతికి దొరికిన ఆయుధాలతో తిరగబడ్డారు. ఢిల్లీ పాలకులు, వారి అధికారులు.. అందర్నీ వెంటపడి తరమసాగారు.

పాలకులపై అసహ్యం నరనరాన నిండిపోయిన సమస్త తెలంగాణ ప్రజానీకం, ఆంధ్రరాజ్యాల సైన్యాలు ఓరుగల్లు విముక్తి కోసం దాదాపు ఆరునెలలు 'విజయమో వీరస్వర్గమో!' అన్నట్లు తీవ్రపోరాటం చేసి.. విజయం సాధించాయి. ఈ యుద్ధానికి నాయకత్వం వహించి, అన్నివైపులా యుద్ధతంత్రాలు నడిపి, తిరుగులేని పోరాటపటిమతో ఓరుగల్లును విముక్తం చేసిన మహాయోధుడు.. కాపయనాయకుడు!

రాజప్రాసాదం.. ఓరుగల్లు నగరం పూర్తిగా కాపయ సైన్యం వశమయ్యాయి. ఓరుగల్లు ప్రజల జయజయ ధ్వానాల మధ్య మహిళా యుద్ధపటాలం నాయకురాలు పున్నగి.. రాజప్రాసాదం పైకెళ్లి తిరిగి కాకతీయకేతనం ఎగుర వేసింది. కానీ, కాకతీయ కేతన రెపరెపలు రెండు రోజులు మాత్రమే ఉన్నాయి.

మూడోరోజు నుంచి ముసునూరు కేతనం రెపరెపలాడింది. కారణం.. ఇప్పుడు అక్కడ కాకతీయవంశ వారసులు ఒక్కరంటే ఒక్కరూ కనిపించలేదు. దాంతో మిత్రసమాఖ్య ఏకగ్రీవ నిర్ణయంతో ముసునూరి వంశ కేతనం ఎగరేశారు. కాపయ నాయకత్వాన తెలుగువారి కొత్తరాజ్యం తిరిగి ప్రారంభమైంది. కాకతీయ సామ్రాజ్యం అంతమయ్యాక.. ఏడేళ్లపాటు వీరోచితంగా పోరాడి, తురుష్కులను పారద్రోలినా తిరిగి ఆంధ్ర సామ్రాజ్యం ఏర్పడలేదు. కాకతీయ సామ్రాజ్యం వేరువేరు రాజ్యాలుగా స్వతంత్రమవుతూ.. ఆఖరున ఓరుగల్లును విముక్తం చేశాక, ఒకప్పుడు కాకతీయ సామ్రాజ్యానికి రాజధానిగా ఉన్న ఓరుగల్లు ప్రాంతాన్ని.. తెలంగాణ రాజ్యంగా పిలవడం మొదలైంది. ■

## మత్తి భానుమూర్తి



తెలుగువారి చారిత్రక జనజీవితాన్ని మొత్తంగా సప్రమాణ గ్రంథరూపంలోకి తేవాలన్న జీవితాశయంతో రచనలు చేస్తున్నారు మత్తి భానుమూర్తి. ఈయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ చేస్తూ.. థియేటర్ ఆర్ట్స్‌లో నటన, దర్శకత్వంలో డిప్లొమా చేశారు. ఈనాడు దినపత్రికలో రెండేళ్లు పనిచేశారు. స్టేట్ బ్యాంక్‌లో 40 ఏళ్లు ఉద్యోగం చేశారు. ఆ తరవాత చరిత్ర రచనలోకి వచ్చారు. జాయసేనాపతి సీరియల్ నవల ద్వారా 'నమస్తే తెలంగాణ' పాఠకులను వారంవారం పలుకరిస్తున్నారు. కథలు రాసింది తక్కువే! అయినప్పటికీ.. అవన్నీ పాఠకుల అభినందనలు, విమర్శకుల ప్రశంసలు అందుకున్నవే! యండమూరి వీరేంద్రనాథ్‌తో కలిసి ఓ నవల కూడా రాశారు. నాటికలు, రేడియో, టీవీ, సినిమాలకూ పనిచేశారు.